క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అమరావతి: ఈనెల 13 న జరగబోయే ఎన్నికలను సజావుగా నిర్వహించటానికి అన్ని చర్యలు చేపట్టినట్లు సీఐ ఏవీ బ్రహ్మం తెలిపారు. ఈ మేరకు మండలంలోని అన్ని పోలింగ్ బూత్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పోలింగ్‌బూత్‌ల వద్ద ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

అందుబాటులో ఓటర్ స్లిప్పులు

సత్తెనపల్లి: ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటర్ స్లిప్పులను బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్నారు. అయితే ఓటర్ స్లిప్పులు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. వెబ్‌సైట్ నుంచి నేరుగా ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందని చెబుతున్నారు.

నేడు క్రోసూరులో ఎమ్మెల్యే నంబూరు బహిరంగసభ

క్రోసూరు: క్రోసూరులోని నాలుగురోడ్లసెంటర్‌లో శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నంబూరుశంకరరావు ఎన్నికల ప్రచారం, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈమేరకు పార్టీ నాయకులు,ప్రజలు, అభిమానులు హాజరై సభను విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



రాజుపాలెం: రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల వద్ద మాచర్ల–గుంటూరు రహదారిపై శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మండలం ప్రతికులాంక గ్రామానికి చెందిన బి.విజయ్ కుమార్(35)తన లారీని రోడ్డు మార్జిన్‌లో ఆపి టైర్లను పరిశీలిస్తుండగా అదే సమయంలో వెనుక నుంచి మరో లారీ ఢీ కొంది. ఘటనలో విజయ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ షేక్ అమీర్ బాషా సంఘటనా కేసు నమోదు చేసి మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సమర్థులను ఎన్నుకుందాం



సత్తెనపల్లి: స్వేచ్ఛగా ఓటు వేద్దాం ... సమర్థులను ఎన్నుకుందామని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ గుంటూరు జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త మల్లెల చిన్నప్ప అన్నారు. గోరంట్ల లో శుక్రవారం ఓటర్ చైతన్య ప్రచారోద్యమం చేపట్టారు. ఓటు ప్రాథమిక హక్కు అని, ఓటు వేయటం కనీస భాద్యత అన్నారు. కార్య క్రమంలో కమ్యూనిటీ లీడర్ నందిగామ. ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

ఎస్పీ బిందుమాధవ్



దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కోరారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోదర భావంతో ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అంతకుముందు పొందుగల గ్రామంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద జిల్లా ఎస్పీ తనిఖీలు చేపట్టారు.

నా గెలుపు..నల్లేరుపై నడక

- 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో విజయం వైఎస్సార్ సీపీదే
- పోలవరం పూర్తి చేయడమే లక్ష్యం
- పేదవాడి గుండెల్లో జగనన్న గూడు కట్టుకున్నారు
- చంద్రబాబు పాలన అంటే ప్రజలు భయపడుతున్నారు
- సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లాకు ముఖద్వారం సత్తెనపల్లి. పాడి, పంటలను రెండు కళ్ళుగా భావించే రైతులతో పాటు విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు విభిన్న భావజాలం కలిగిన వ్యక్తుల సమాహారం ఈ నియోజకవర్గం సొంతం. ఇక రాజకీయపరంగా చూస్తే ప్రజల తీర్పు విలక్షణం. ఇక్కడ గెలుపోటములను అంచనా వేయడంలో విశ్లేషకులు సైతం తడబడుతుంటారు. ఇంతటి ప్రత్యేకమైన సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబు వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. విజయం దిశగా వ్యూహ, ప్రతి వ్యూహాలతో ముందడుగు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తన గెలుపు నల్లేరుమీద నడకలాంటిదంటున్న అంబటి రాంబాబుతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ పాఠకుల కోసం.

ప్రశ్న: వైఎస్సార్ సీపీ విజయ అవకాశాలు ఎలా ఉన్నాయి?

ఎమ్మెల్యే: రాష్ట్రం విడిపోయిన తర్వాత సీనియర్ అని ప్రజలు చంద్రబాబుకు 2014లో అవకాశం ఇచ్చారు. ఆయన 600 హామీల్లో దేన్నీ సంపూర్ణంగా అమలు చేయలేదు. కేవలం గ్రాఫిక్స్‌తో ఐదేళ్ల రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. అమరావతి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వంది మాగధులకు దోచిపెట్టారు. చంద్రబాబు ఘన కార్యాలు ప్రజలకు అర్థమయ్యాయి. జగన్ మోహన్‌రెడ్డి తోనే ప్రగతి సాధ్యమని విశ్వసించి 2019 ఎన్నికల్లో 151 సీట్లను ఇచ్చారు. చంద్రబాబును 23 సీట్లకు పరిమితం చేశారు. ఈ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధితో కచ్చితంగా 175 అసెంబ్లీ స్థానాలు,25పార్లమెంటు స్థానాలను గెలుస్తామనే నమ్మకం మాలో ఉంది. మీ కుటుంబంలో లబ్ధి జరిగితేనే ఓటెయ్యండి అని అడిగే దమ్మున్న, గట్స్ ఉన్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి. ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

ప్రశ్న: అసలు అభివృద్ధే జరగలేదు.. పప్పు బెల్లాల్లా పంచి పెడుతున్నారనే విమర్శలకు మీ సమాధానం?

ఎమ్మెల్యే: ఇది కేవలం ప్రతిపక్ష పార్టీలు, పచ్చమీడియా పదేపదే చేస్తున్న దుష్ప్రచారం. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఎన్నడూ లేని విధంగా గాంధీజీ కలలుగన్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చాం.నాడు - నేడుతో పాఠశాలలు, వైద్యశాలల రూపు రేఖలను మార్చాం. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు చురుగ్గా జరిగాయి. మరోవైపు పారదర్శక పద్ధతిలో సంక్షేమపథకాల నగదు అర్హులైనవారి అకౌంట్లలో జమవుతున్నాయి. చిత్రమైన విషయం ఏమిటంటే మేము చేపట్టే సంక్షేమాన్ని ప్రతిపక్ష పార్టీ నాయకులు గతంలో ఎందుకు అమలు చేయలేక పోయారు? ఇప్పుడు వాటిని ఆపేస్తామని చెప్పే ధైర్యం వారిలో లేక ఇంతకంటే మెరుగ్గా ఇస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ఏమిటో వారికి తెలుసు కానీ ఏదో రాద్ధాంతం చేయాలి కదా.

ప్రశ్న: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఇంకా ఎందుకు పూర్తి కాలేదు?

ఎమ్మెల్యే: పోలవరం జాతీయ ప్రాజెక్టు. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సింది. కానీ చంద్రబాబు తాను నిర్మిస్తానంటూ ముందుకొచ్చారు. కేవలం ఆ ప్రాజెక్టును ఏటీఎం గా మార్చుకున్నారని ప్రధాని మోదీ విమర్శలు చేశారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి రివర్స్ టెండరింగ్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ పనులు చురుగ్గా జరిగేలా చూస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రేపు అధికారంలోకి రాగానే పూర్తి చేసి ప్రారంభిస్తాం.

ప్రశ్న: సత్తెనపల్లి ఎమ్మెల్యేగా 2024 ఎన్నికల్లో మిమ్మల్నే ఎందుకు గెలిపించాలి?


ఎమ్మెల్యే: నేను ఈ ప్రాంతం వాడిని కాదు. నాది రేపల్లె. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశిస్తే 2012లో సత్తెనపల్లి వచ్చా. రెండేళ్లపాటు గడప గడపకు తిరిగా. 2014లో ఎన్నికల్లో పోటీ చేశా. నా ప్రత్యర్థి కోడెల శివప్రసాదరావు నాపై 924 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఓడినా ప్రజలతోనే ఉన్నా. వారి తరపున ప్రజా వ్యతిరేక విధానాలు, పాలకుల అవినీతిపై పోరాడా. నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పించా. దీంతో 2019 ఎన్నికల్లో నన్ను ఆదరించారు. 20,876 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించా. సత్తెనపల్లికి మంచి చేసే అవకాశం దొరికింది. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి చేపట్టా. రైతులకు చివరి ఎకరా వరకు సాగు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే లక్ష్యం. నేను పుట్టింది రేపల్లె అయినా సత్తెనపల్లి వచ్చి 12 ఏళ్లయింది. నేనిప్పుడు స్థానికుడిని. నా కట్టె కాలేది సత్తెన పల్లిలోనే.

ప్రశ్న: కన్నా లక్ష్మీనారాయణ గుంటూరు నుంచి సత్తెనపల్లి వచ్చి మీకు ప్రత్యర్థిగా నిలిచారు. దీనివెనకు ప్రత్యేక కారణం ఉందా?

ఎమ్మెల్యే: చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తనను ఎలాగైనా ఓడించాలని అందులో భాగంగా కన్నాను నాపై పోటీకి తీసుకొచ్చారు. ఇద్దరం ఒకే సామాజిక వర్గం. ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చాం. ఆయన ఎక్కువసార్లు గెలిచిన వ్యక్తి .. నేను ఒకసారి గెలిచి ఆ తర్వాత ఓటమిపాలయ్యా. 2019లో ఇక్కడి నుంచి గెలుపొంది ఈ ప్రాంత ప్రజల అభిమానాన్ని చూరగొన్నా. నా గెలుపు నల్లేరు పై నడకలాంటిది. 20 వేల పై చిలుకు మెజార్టీ రావడమే నా లక్ష్యం. నా గెలుపును ఆపడం వారికి అసాధ్యం.

ప్రశ్న: సత్తెనపల్లిని నిర్లక్ష్యం చేశారని, పేరేచర్ల–కొండమోడు రహదారి విస్తరణ, అచ్చంపేట రోడ్ లో ఫ్లైఓవర్ పూర్తి చేయలేదని విమర్శలు ఉన్నాయి?

ఎమ్మెల్యే: అభివృద్ధి అనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ. పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు 50 కిలోమీటర్ల రహదారి నాలుగు వరుసల జాతీయ రహదారిగా 2021లో ఆమోదించటం జరిగింది. దీనికి రూ. 1035 కోట్లు నిధులు మంజూరయ్యాయి .234 హెక్టార్ల భూ సేకరణ ప్రక్రియ పూర్తయింది. టెండర్లు కూడా ముగిసాయి. సాంకేతిక కారణాలతో ఆగింది. పనులు ప్రారంభమవుతాయి. నకరికల్లు మండలం గుండ్లపల్లిలో రూ. 10.61 కోట్లతో ఇండో ఇజ్రాయిల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా జరిగింది. అచ్చంపేట రోడ్ లోని రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ కోసం ప్రతిపాదనలు పంపాం. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంది.



ప్రశ్న: 2019లో ఇచ్చిన వాగ్దానాలను ఏ మేరకు అమలు చేశారు?

ఎమ్మెల్యే: ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం అమలు చేశాం. హామీలివ్వక పోయినా ఇంకొన్ని అమలుచేశాం. ముఖ్యంగా డ్వాక్రా మమిళలకు రుణాలు మాఫీ చేశాం.31 లక్షల మందికి ఇళ్ళ పట్టాలు ఇవ్వడమే కాక పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం. మేనిఫెస్టోను తుచ్చా తప్పకుండా అమలు చేయడం వల్ల జగన్ మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో గూడు కట్టుకున్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే సంక్షేమ పాలన



విప్పర్లలో బ్యాలెట్ నమూనా చూపించి ఓట్లు అభ్యర్థిస్తున్న నంబూరు వసంతకుమారి

విప్పర్ల(క్రోసూరు): సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజాశీర్వాదమే మరింత బలం చేకూరుస్తుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. క్రోసూరు మండలం విప్పర్లలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ ప్రజల్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా నంబూరు వసంత కుమారి మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రజాభిమానం చూస్తుంటే రాష్ట్రంలో 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవడం ఖాయమన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల అరాచకాలు మాత్రమే జరిగాయని మళ్లీ చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే అవే అక్రమాలు, అన్యాయాలకు అవకాశం ఇచ్చినవారమవుతామన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు, , ఎంపీ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్ యాదవ్ కు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని బ్యాలెట్ నమూనాను చూపి అభ్యర్థించారు.

తొండపిలో ఫ్యామిలీ డాక్టర్

తొండపి(ముప్పాళ్ళ): తొండపిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు పీ.రమాదేవి 180 మందికి వైద్య సేవలందించారు. గర్భిణీలకు అవసరమైన టీకాలు వేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్ళి అవసరమైన వైద్య సేవలందించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ప్రచార రథంపైనుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అచ్చంపేటలో వైఎస్సార సీపీ జెండాలతో కార్యకర్తల కదనోత్సాహం



గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు, తదితరులు

పల్లెల్లో నూతనోత్తేజం

అచ్చంపేట, లింగాపురంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఆయనకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నంబూరు ట్రాక్టర్ నడుపుతూ స్థానిక యువతలో జోష్ నింపారు. తన ప్రచార రథంపై గ్రామంలోని వీధుల్లో కలియతిరిగారు. స్థానికులకు అభివాదం చేస్తూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. - అమరావతి

ఆరోజు ప్రశంసించారు..
ఈరోజు ప్రశ్నిస్తున్నారు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై చంద్రబాబు,ఎల్లో మీడియా దుష్ప్రచారం తగదంటూ పలువురు హితవు


నీతి ఆయోగ్ సూచనతో రాష్ట్ర ప్రభుత్వం అమలకు సిద్ధమవుతున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పదే పదే దుష్ప్రచారం చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. భూయాజమాన్య హక్కుల చట్టంపై ఆనాడు అసెంబ్లీలో ప్రశంసించి, ఇప్పుడు ఎన్నికల వేళ విమర్శించడాన్ని పలువురు న్యాయవాదులు తప్పుబడుతున్నారు. రాజకీయాల కోసం గొప్ప సంస్కరణలపై బురదజల్లడం హేయమని వారు మండిపడుతున్నారు. - సత్తెనపల్లి

చంద్రబాబుకు రూ.65 కోట్లు



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ ఒకటో తేదీన చంద్రబాబు ప్రభుత్వానికి రూ. 65 కోట్ల నిధులు కూడా పంపించింది. అప్పట్లో ఈ యాక్ట్ అమలుకు నిధులు సరిపోలేదని కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు ఓ లేఖ కూడా రాశాడు. ఇప్పుడు ఎన్నికల వేళ సీఎం జగన్ ప్రభుత్వాన్ని, ఆయన పరిపాలనను అపహాస్యం చేస్తుండటం హాస్యాస్పదం. అంకాళ్ళ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది, సత్తెనపల్లి

భూ వివాదాలకు చట్టంతో చరమగీతం



భూ యాజమాన్య హక్కు చట్టంతో వివాదాలకు తావుండదు. భూ యజమానికి సంపూర్ణ హక్కు కల్పించే దిశగా ఎన్నో ప్రయోజనాలు ఇచ్చే ఈ యాక్ట్ పై టీడీపీ, జనసేన నేతలు బూటకపు ప్రచారాలకు దిగడం దారుణం. వారి స్వప్రయోజనాల కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై దుష్ప్రచారం చేయడం సరికాదు.ఎన్నికల సమయంలో ప్రజల నుంచి ఆదరణ లేకనే ఇలాంటి తప్పుడు ప్రచారాలకు ప్రతిపక్షాల నాయకులు దిగజారుతున్నారు.

–చిన్నం మణిబాబు, న్యాయవాది,సత్తెనపల్లి

ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలి



భూహక్కు చట్టం పై లేనిపోని అపోహలు సృష్టించి ప్రజలను ప్రతిపక్షనాయకులు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి. భూమికి సంపూర్ణ హక్కుల తో పాటు రక్షణ కల్పించి భూకుంభ కోణాలు, అక్రమాలను నిరోధించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. నీతి అయోగ్, ప్లానింగ్ కమిషన్ సిఫార్సుల మేరకే చట్టాన్ని రూపొందించారు.

–రాజవరపు నరసింహారావు, న్యాయవాది, సత్తెనపల్లి

భూ సర్వే పూర్తి చేయాలి



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ముసాయిదా పంపింది. దేశ వ్యాప్తంగా సమగ్ర భూ సర్వే చేయాల్సి ఉంది. సర్వే పూర్తయిన తర్వాతే న్యాయ నిపుణులు, మేధావులు, రెవిన్యూ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని అన్ని రాష్ట్రాల్లో చట్టాన్ని అమలు చేస్తారు. ఎన్నికల సమయంలో ఈ యాక్ట్ పై దుష్ప్రచారం చేయడం మంచిది కాదు. అవగాహనతో ప్రతిపక్షాల నాయకులు మసలుకోవడం ఉత్తమం. లేదంటే ప్రజల ముందు చులకనైపోతారు.

–సయ్యద్ అబ్దుల్ రహీం, సీనియర్ న్యాయవాది, సత్తెనపల్లి

ప్రచార హోరు .. చేరికల జోరు



అబ్బరాజుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు కుటుంబ సభ్యులు



బలుసుపాడు లో టీడీపీ, జనసేనను వీడి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు

- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు శంకరరావు, కుటుంబసభ్యులు
- జోరుగా వైఎస్సార్‌సీపీలో చేరికలు



కన్నెగండ్లలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినవారితో నంబూరు శంకరరావు

పెదకూరపాడు : పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రచారంలో దూకుడు పెంచారు. సుడిగాలి పర్యటనతో ప్రచార హోరు కొనసాగిస్తున్నారు. ఆయనకు మద్దతుగా సతీమణి వసంత కుమారి, కుటుంబ సభ్యులు సైతం ప్రజలతో మమేకమవుతున్నారు. మరో వైపు టీడీపీ, జనసేన నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం పెదకూరపాడు మండలం బలుసుపాడు, కన్నెగండ్లకు చెందిన ఆయా పార్టీల నాయకులు ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో చేరారు. ఈనెల 13న జరిగే పోలింగ్ లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని నంబూరు సూచించారు.

టీడీపీ మూకల దాడి- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలు

రొంపిచర్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ గుండాలు దాడిచేసి గాయపర్చిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలో నరసరావుపేట–చేజర్ల మార్గంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పిల్లకత్తుల నాగరాజు, యల్లబోయిన కోటేశ్వరరావు మోటారు సైకిల్‌పై కొత్తపల్లికి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంగూరి కోటేశ్వరరావు, పఠాన్‌సైదా దారికాచి కొట్టారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా



ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఆత్మీయసమావేశానికి హాజరైన ఆర్యవైశ్యులు

అమరావతి : ఆర్యవైశ్యులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శంకరరావు హామీ ఇచ్చారు. ఓ ప్రైవేటు అతిథి గృహంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని ఆర్యవైఐశ్య సోదరులు ఎంతగానో సహకరించారని వారి ఆదరణాభిమానాలను ఎన్నటికీ మరచి పోలేనన్నారు. భవిష్యత్‌లోనూ ఆర్యవైశ్యలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించటానికి తాను సిద్ధంగా ఉన్నానన్నా రు. ఈ ఎన్నికలలో వైఎస్సార్ సిపికి అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ నాయకులు పులిపాటి పవన్‌కుమార్,పారేపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల భవిష్యత్ నిర్దేశించే ఎన్నికలివి

- మంత్రి తనయ డాక్టర్ అంబటి మనోజ్ఞ
- రెంటపాళ్ల లో ఎన్నికల ప్రచారం



రెంటపాళ్లలో ప్రచారంలో మంత్రి తనయ డాక్టర్ అంబటి మనోజ్ఞ

సత్తెనపల్లి: ఈ ఎన్నికలు పేదల భవిష్యత్తును నిర్దేశించనున్నాయని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తనయ డాక్టర్ అంబటి మనోజ్ఞ అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు ఎదురేగి భారీగా స్వాగతం పలికారు. హారతులు ఇచ్చారు.అనంతరం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో ప్రతులతోపాటు , ఓటు గుర్తు కర పత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబటి మనోజ్ఞ మాట్లాడుతూ పేదవాడు బాగుపడాలన్నా, వారి భవిష్యత్తు మారాలన్నా ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో చర్చించుకోండన్నారు. ఈ ఐదేళ్లలో మంచి జరిగిందని భావిస్తే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి అంబటి. రాంబాబు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలి పించాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమం లో పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ ఏకుల మనీష, స్థానిక నాయకులు కొర్లకుంట నాగ మల్లేశ్వరరావు, పల్లె గాబ్రి యేలు, చల్లా శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.